


రైలు నడుస్తున్న చకచక శబ్దం సన్నగా వినపడుతూంది. అప్పుడు గ్రహించాడు, అద్దాల తలుపులు మూసి ఉన్నాయని. వెంటనే తెరిచాడు. ఉవ్వెత్తుగా వేడిగాలీ, బొగ్గునెరుసులూ, పెద్ద శబ్దం రైలుపెట్టెలోకి దురాక్రమణ చేశాయి. నడివేసవిలో కూపేలో ప్రయాణంచెయ్యడం బుద్ధిపొరబాటు. అద్దాల తలుపులు దించితే ఉక్క. ఎత్తితే వేడిగాలి. చీకటిపడ్డా ఇంకా చల్లబడ లేదు గాలి.

కూపేలో ఒంటరిగా ఎన్నడూ ప్రయాణం చెయ్యకూడదు. కూడా ఎవరైనా ఉండాలి, తోడు. వయసు మళ్ళుతున్నకొద్దీ వాంఛ లెక్కువౌతాయి.

అప్పుడూ నడివేసవే. అయితే ఆ రోజులు వేరు. పెళ్ళయిన రెండోరోజుని నేనూ మా ఆవిడా బెంగుళూరు ప్రయాణం. ముందుగా టికట్టు కొనుక్కోవాలనీ, బర్తులు రిజర్వు చేయించుకోవాలనీకూడా తోచలేదు. మా అమ్మకి మాత్రం సూచనగాచెప్పి, ఎవరికీ తెలీకుండా టాక్సీ ఎక్కించేశారు మా ఆవిణ్ణి. వెనకాల ఇంకో టాక్సీమీద మా బావమరిది మమ్మల్ని తరుముకొచ్చాడు. మౌంట్ రోడ్‌లోంచి తిరుగుతుంటే పట్టుకున్నాడు. మా ఆవిడకి ఓ పెట్టెనిండా చీరలూ, నా చేతికి కొంత డబ్బూ ఇచ్చి, నా భుజంతట్టి వెళ్ళిపోయాడు.


ప్లాట్‌ఫారంమీద కంగారుగా తిరుగుతుంటే, పరమేశ్వర్రావు పలకరించాడు. అతనెవరో నే నెరగను. అతని పేరుకూడా తరవాతే తెలిసింది. 'ఎవరు మీరు, ఎక్కడికి?' అని అడిగాడు. బహుశా రిజర్వేషన్ ఇన్‌స్పెక్టర్ని నేను ప్రాధేయపడుతూ అడగడం చూసి ఉంటాడు. దుస్తుల్నిబట్టి గార్డు గ్రహించాడు. ఆ మొదటి పరిచయంలోనే అప్తుడైపోయాడు పరమేశ్వర్రావు. మహా గొప్పమనిషి. మమ్మల్ని ఒక కూపేలో పారేశాడు, మా పెట్టెలతో సహా. లేకపోతే వాటిని ప్లాట్‌ఫారంమీద మరిచిపోయేవాళ్ళమే. అన్ని తలుపులూ మూసేశాం. అప్పుడు ఉక్కా— చిరాకూ – అవేవీ ఏమీ తెలియలేదు. రాత్రి ఏ పదకొండింటికో పరమేశ్వర్రావు తలుపు తట్టాడు.

"ఆకలి తెలియని స్థితిలో ఉన్నారు. మిమ్మల్ని మాత్రం పస్తుపడుకోనివ్వను" అన్నాడు. అతని వెనక ఒక కుర్రాడు నా ఎత్తు కారియరు తీసుకొచ్చి కంపార్ట్‌మెంట్‌లో పెట్టాడు. తినడం మొదలెట్టేదాకా మాకంత ఆకలిగా ఉందని తెలియదు. పరమేశ్వర్రావు గొప్పమనిషి.

ఆ పిచ్చి ఉత్సాహంలో అన్నీమరిచిపోగలం-ఉక్క, ఆకలి, చికాకు, అన్నీ. ఇప్పుడా ఉత్సాహం చచ్చినా రాదు. వయసు మళ్ళుతున్న సమయంలో అనుభవానికి హంగులు చాలా కావాలి-వెన్నెల, పూలతోట, చల్లగాలి వంటివి. చల్లగాలీ, వెన్నెలా, పూలతావులూ, మనసులోనే ఉన్నప్పుడు ఇంక బయట అవి లేకపోతేనేం?

సూళ్ళూరుపేటలో కాబోలు. ఎందుకో రైలు ఆగింది. తలుపు తెరిచాను.

పాలగుమ్మి పద్మరాజు




'హల్లో మిస్టర్ రామానుజులూ!! అనుకోని ప్లెజర్ ఇది' అంటూ నవ్వుతూ ఎక్కాడొక పెద్దమనిషి

'రండి, రండి' అన్నాను, మర్యాద కోసం. అతనెవరో నాకు గుర్తురాలేదు. ఎక్కడో చూసిన ముఖమే. ఎక్కడా అని! ఎవరైతేనేం? ఒక పెద్ద మనిషి. తోడుగా ఉంటాడు. ఒంటరిగా ఈ ఉక్క అనుభవించడంకంటె మరొకరితో పంచుకుంటే కాస్త నయం. మాటల్లోపెట్టి అతనెవరో తెలుసుకోవాలి. ఇంత చనువైన ముఖం! పేరెలా మరిచిపోయాను? వయసు మళ్ళుతోందన డానికి ఇంతకన్న నిదర్శనం ఇంకేం కావాలి?

'ఎంతవరకని' అన్నాను.

'చెప్పలేను. బెజవాడ దాకా తప్పదు. అవసరమైతే వైజాగ్.'

చంపాడే! నాలుగు జిల్లాలున్నాయి బెజవాడకీ వైజాగ్‌కీ మధ్య.

మీరెవరు బాబూ? జ్ఞాపకం రావడం లేదు, అని అడగడం అమర్యాద.

'ఇప్పుడేం జేస్తున్నారు?'

'ఏముందండి? అదే.'

కొరుకుపడ్డంలేదు మనిషి, స్నేహితుల పేర్లు చెప్పితే ఏమన్నా తేల్తాడేమో.

'ఈ మధ్య మీరు క్లబ్బుకి వాస్తున్నట్టులేదే. మన బావినీడు సెక్రటరీ అయినారు,' అన్నాను సాహసించి.

'అలాగా!' అన్నాడు.

ఇంతకీ బావినీడు ఇతనికి తెలుసా తెలియదా?

ఇంకో ప్రశ్న.

'పిల్లా జెల్లా ఎంతమంది?'

'ఆమరణ బ్రహ్మచారిని, లోకమంతా నా బిడ్డలే. నాకామాత్రం గుండె నిబ్బరంలేదనుకున్నారా? అప్పుడూ ఇప్పుడూ నీదీక్ష ఒకటే. హ-హ-హ-'

ఆ నవ్వు నన్ను ఎగతాళిచేస్తూ రైలు చప్పుడుతో కలిసి కూపేఅంతటా నిండిపోయింది.

బిట్రగుంటలో గోవిందు కారియరు తీసుకొచ్చి కంపార్ట్‌మెంట్‌లో పెట్టి సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయాడు. ఇంక ఆమనిషి సంగతి మరిచిపోయి భోజనం చేసి నిద్రపోదామని నిశ్చయించుకున్నాను. అయినా మర్యాదకోసం,

'రండి భోంచేద్దాం,' అన్నాడు.

'రాత్రిపూట నేనేమీ తీసుకోనుగా?' అన్నాడు పెద్దమనిషి నవ్వుతూ.

గో టు-హెల్, అతనెవరో తెలియకపోతే వొచ్చిన నష్టమేముంది? అసలా పెద్దమనిషి నేను గుర్తించలేదన్న సంగతి గ్రహించి తన ఊరూపేరూ చెప్పుకోవాలి. నన్నెందుకిలా మధ్యన పెట్టాలి? అసలు నేనిలా శ్లేష్మంలోపడ్డ ఈగలా ఎందుకు కొట్టుకు చావాలి? ఎవడో—ఏమో నాకెందుకు?

పెరుగు బాగుంది. దాంతోటే రెండు ముద్దలుతినేసి కారియరు మూసేశాను, చెయ్యికడుక్కొచ్చాను.

రంగారావుని కూడా ఈ కంపార్ట్‌మెంటులో ఎక్కమనవలసింది. కబుర్లు చెప్పుకుందుం. అయితే నేను రమ్మనందే అతనెలా వస్తాడు? గవర్నమెంటుద్యోగాల్లో చిన్నా పెద్దా తారతమ్యాలు పాటించక తప్పదు. నేను సూపరింటెండెంటునీ, అతను సర్కిలూ. అతను సూపరింటెండెంట్ అయినప్పుడు, తనకింద సర్కిల్‌ని ఆమడదూరంలో అట్టే పెడతాడు. నిజానికి ఈ ఆసామీకన్న రంగారావేం తీసిపోయాడు? వీడు నాతో సమానుడనిపించి, రంగారావు అనిపించకపోడం జబ్బుకాదూ? ఈ జబ్బు గవర్నమెంటు ఉద్యోగస్థులకి అందరికీ ఉంటుంది.

వీడిపేరయినా తెలిస్తే బాగుండును.

"సిగరెట్ కాలుస్తారా మిస్టర్" కావాలనే పొడిగించాను, పేరేమన్నా అతడు పూర్తిచేస్తాడేమోనని.

"నాకు అటువంటి అలవాట్లు లేవు గదండి?"

"ఎప్పటినించి మానేశారు మిస్టర్ సుబ్బారావ్?"

"అసలు నాకెప్పుడూ అలవాటు లేదండి."

అయితే ఈయన పేరు సుబ్బారావన్న మాట. ఏ సుబ్బారావు? ఆంధ్రదేశంలో అర్ధభాగం సుబ్బారావులే. ఇంక ఆ పేరు పెడితే కఠినశిక్ష విధించబడుతుందని ఓ చట్టంచేస్తే బాగుండును ప్రభుత్వం. అన్నట్టు కన్నడదేశంలోనూ ఉన్నారు సుబ్బారావులు—ఒకవేళ ఆ రోజుల్లో బెంగుళూర్లులో అయిన పరిచయం కాదు

గదా? ముఖం ఎక్కడో బాగా చూసి నట్టే ఉంది.

"అన్నట్టు సుబ్బారావుగారూ!"

"నా పేరు రామారావండి"


చచ్చాను. ఇందాకే సుబ్బారావు పేరెట్టి పిలిచినప్పుడే ఎందుకుచెప్పలేదు? పోనీ ఇప్పుడైనా పేరు తెలిసింది. అయితే మాత్రం ఏంలాభం? తెలుగునాట సుబ్బారావు లెంతమందున్నారో రామారావులు అంతమందీ ఉంటారు. ఛ! అయినా నాకెందుకీ తాపత్రియం!

కళ్ళుమూసుకుని ఆలోచనలు శ్రీధర్ మీదికి మళ్ళించాను.

శ్రీధర్‌ని పట్టుకుతీరాలి. చేతికి చిక్కినట్టేచిక్కి పాదరసంలా జారిపోయాడు. తప్పు రంగారావుది. మనిషిని పట్టుకోగానే నాకు కబురుచెయ్యొద్దూ? క్రెడిట్ అంతా తనకే దక్కాలనుకున్నాడు. ఫూల్. అబ్బే అది న్యాయం. పాపం మంచి ఎత్తే. తను ఒంటిగాడు. తోడెవరూ లేకుండా తెగించి వాణ్ణి పట్టుకోడం ఎలాగ? పాతకేడీ స్నేహితుడిలా నటించి— అతన్ని హోటల్‌కి తీసుకుపోయాడు. గదిలో పెట్టాడు. శ్రీధర్ స్నానంచేస్తానని బాత్‌రూంకి పోయాడు. నీళ్ళ చప్పుడు. రంగరావు నాకు ఫోన్ చేశాడు. సిబ్బందితో వెళ్ళాం, బాత్‌రూం తలుపు ఊడగొట్టి లోపలప్రవేశించాం. కుళాయిలోంచి నీళ్ళొస్తున్నాయంతే— శ్రీధర్ లేడు. వెంటిలేటర్ అద్దంకోసేసి దాటేశాడు.

శ్రీధర్ గుండెలుతీసిన బంటు. పట్టపగలు బాంకులో ప్రవేశించి, కాషియర్‌ని బెదిరించి పదివేలు పట్టుకుని పారిపోయాడు. నేనతన్ని చూడలేదు. ఫోటోయే చూశాను.

రాత్రి రైల్వే పోలీసులు ఫోన్‌చేశారు- శ్రీధర్ వంటిమనిషిని సెంట్రల్‌లో చూశామని. వాళ్ళకీ ఫోటోయే ఆధారం. రంగారావుకి ఫోన్‌చేశాను. సిబ్బందితో




సెంట్రల్‌కి వచ్చాం — హౌరామెయిల్ కదులుతుండగా, మా హెడ్ అరిచాడు ఒక స్లీపర్‌లో శ్రీధర్‌ని చూశానని. ఆపించాం. ట్రెయినంతా వెతికిస్తే గంటపైన పడుతుంది. గార్డు ఒప్పుకోలేదు. నేను కూపేలో ఎక్కాను! రంగారావు మరొక పెట్టెలో ఎక్కాడు. శ్రీధర్ ఈ రైల్లోంచి దిగి పారిపోలేదు. మాసిబ్బంది సూళ్ళూరు పేటలో ఏదో సాకుమీద రైలు ఆపించి సగంపెట్టెలు వెతికారు. బిట్రగుంటలో కొన్ని వెతికారు. గూడూరులో తప్పక పట్టేస్తారు.

"మిస్టర్ రామానుజులూ! నిద్రపోతారా?" అన్నాడు రామారావు.

'తొందరలేదండి, గూడూరు దాటాక' అన్నాను.

అసలింతకీ నే నెవరినో అతనికి తెలుసా? పేరు తెలుసు, అంతకుమించి ఇంకేమన్నా తెలిస్తే సంభాషణలో బయట పడదూ? అతనూ నాలాగే తికమక పడుతున్నాడా?

'మిస్టర్ రామారావు! మొన్న తిరువేంగడం కొట్టేశాడండి, బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్. ఎంత బాగా ఆడాడని'

'విన్నానండి'

'ఒకొక్క బ్రేక్ నూరుకి తక్కువ లేదు.'

'బాగా ఆడతాడు'

అయితే తిరువేంగడాన్ని ఎరుగునన్న మాట. అంటే క్లబ్బుకి వచ్చిఉండాలి.

'క్లబ్బుకి ఒక ప్రొజెక్టర్ కొన్నాం.'

'విన్నాను'

"ఒకపిక్చర్ వేశాం "ద తీఫ్". ఒక్క డయిలాగ్ లేదండి. ఎంతబాగాతీశారని"

రా మా రా వు నావంక చూశాడు. చిరునవ్వు నవ్వాడు. ఏమిటితను? ఎంత ప్రయత్నించినా అంతుపట్టడం లేదే—

అబ్బ! కూపేలో ఎంత ఉక్కగాఉంది! గూడూరు వస్తున్నట్టుంది, ట్రెయిన్ వేగం తగ్గింది. తలుపు తెరిచి గుమ్మంలో నిలబడ్డాను.

రైలు ఆగింది. రంగారావు దూరాన్నించి వస్తున్నాడు. కిందికిదిగాను. రంగారావు సెల్యూట్ చేశాడు.

"అన్నిపెట్టెలూ గాలించాం. మనిషి మనిషినీ పరీక్షగా చూశాం." అన్నాడు.

'అస లిందులో ఎక్కలేదేమో!'

"ఎక్కాడండి. మనహెడ్ ఒకపెట్టెలో అతన్ని గుర్తుపట్టి ఒక పక్కనుంచి ఎక్కుతుంటే, మరో పక్కనించి దిగిపోయాట్ట."



'ఎక్కడ'

'సూళ్లూరుపేటలో'

'అరె,అయితే అక్కడేదా టేశా డేమో'

'హెడ్ నాతో చెప్పలేదు. బిట్రగుంట దాటాక చెప్పాడండి. ఏమంటే, ఒకకంపార్టుమెంటులోరైలుకదులుతుంటే శ్రీధర్ ఎక్కడం చూశానన్నాడు."

"వెంటనే వాక్యూమ్‌బ్రేక్ లాగి రైలు ఆపవలిసింది".

'అదేనండి అతడు చేసిన పొరబాటు బిట్రగుంటలో ట్రెయినంతా చూసేశాం. ఎక్కడా కనబడలేదు'

'వాడు సూళ్లూరుపేటలోనే దాటేశాడు ఇంకా మనం ఈరైల్లో ప్రయాణంచేసి ఏం లాభం'.

"అదేనండి," అంటూ ననిగాడు రంగారావు. 'హెడ్ అన్నిస్టేషన్లకీ ఇక్కడి నుంచి ఫోన్‌చేస్తున్నాడు. ముఖ్యంగా సూళ్ళూరుపేట పోలీస్‌స్టేషన్‌కి కబురు అందజెయ్య'మన్నాను.'

'మనంఇప్పుడు మద్రాసు చేరుకోడం ఎల్లా ?'

'ఇక్కడ మనస్నేహితుడు మైకామైన్‌లో వొకడున్నాడు. కారుపంపమని అతనికి చీటీరాసిచ్చి ఒక కానిస్టేబుల్‌ని పంపాను.'

ఈలోగా గోవిందొచ్చి కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి నాపెట్టె కారియరు దింపాడు. రైలు కదలబోతోంది. గార్డు విజిల్ ఊదాడు. ఇంజన్ కూసింది.

రంగారావు నా వెనక ఎవర్నో దెయ్యాన్ని చూసినట్టు ఒకక్షణంచూశాడు. కుతూహలం కొద్దీ నేనూ చూశాను. కిటికీ అద్దంవెనక రామారావు ముఖం మా ఇద్దర్నీ చూస్తోంది.

'కంయ్' మని రంగారావు విజిల్ నాచెవుల్లోంచి గుండెలదాకా ఊపేసింది. పదిగజాలు పోయినరైలు కర్రుమని బ్రేక్‌చప్పుడు చేస్తూ ఆగింది. రంగారావు పరుగెత్తాడు. వెకకాల పరుగెత్తుకుంటూ వస్తున్న కాన్‌స్టేబుల్స్‌ని ఉద్దేశించి.

'అటునించి రండి. ఆ పక్కనే దిగిపోయాడు' అని అరిచాడు.

'ఏడీ' శ్రీధర్ ఎక్కడ ? నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి అడిగాను.

"వాడేనండి, మీ కంపార్టుమెంటు కిటికీలోంచి ముఖం కనబడలే ? వాడేనండి."

రంగారావు హడావిడిగా అవతలి పక్కకి దిగివెళ్ళాడు. నేను పిడుగుదెబ్బ తిన్నట్టు నిలబడిపోయాను. ఓ మైగాడ్ ! అవును, రామారావు కాదు శ్రీధరే. ఫోటోలో చూసిన ముఖం అదే, అతనికి నాపేరెల్లా తెలుసు? అయ్యో రామ ! సెంట్రల్‌లో అంత హంగామా చేశాక నాపేరు,ఉద్యోగం వాడికితెలీకండా ఎలా ఉంటుంది. రామానుజులూ! ఎంత మట్టిబుర్ర నీది? పోలీసు ట్రెయినింగ్‌లో మొదటిసూత్రం మరిచిపోయావు. చూసిన ప్రతిముఖం, పట్టుకోవలసినవాడిఫోటోతో పోల్చి చూసుకోమని నీ కింది వాళ్ళకి నువ్వే చెప్పావుగా ? నీ కసలా ఆలోచనయినాతట్టిందా? పైగాచేతికిచిక్కినపిట్టని వదిలేశాడని రంగారావుని తూలనాడావు. అందరికన్న పెద్ద దద్దమ్మవన్న సంగతి స్పష్టంగా రుజువైపోయింది. చేతికి చిక్కినపిట్ట ! రెండుసార్లు తప్పించుకున్నాక మళ్ళీ దొరుకుతుందా, చేతికి చిక్కినపిట్ట ! !